# విచారణ

అది ఆడ అయినా, మగ అయినా, గొప్ప అయినా, పేద అయినా, ఒక తప్పుచేస్తే, ఆ తప్పుకు శిక్ష, ఒకేలా వుంటే అప్పుడు ఆ సాంప్రదాయం చాలా గొప్పదవుతుంది.

—జయప్రద

ఆరోజు ఆ ఇంట్లో ప్రొద్దుననగా మొదలయిన కేసు విచారణ సంధ్య వాలిపోతున్నా ఇంకా పూర్తికాలేదు. ఆ విచారణలో ఒక వైపు నుండి సంజాయిషీలు, క్షమాపణలు, అర్థింపులు, ప్రమాణ స్వీకారాలు–మరోవైపు నుండి సంజాయిషీలు నిషిద్ధాల సలహాలు–శాశింపులు–నీతి సూత్రాలు ఆగకుండా ప్రవహిస్తూనే వున్నాయి.

అందులో ముగ్గురు వ్యక్తులు మాత్రమే నిశ్శబ్దంగా వున్నారు. అందులో ఒకరు అరవై అయిదు సంవత్సరాల వృద్ధుడు తన జీర్ణ కాయాన్ని అంతకంటే జీర్ణమయిపోయిన ఈజీ ఛెయిర్‌లో వాల్చి కళ్ళు మూసుకుని అంతా వింటున్నాడు. అతని పేరు పరంధామయ్య. అతను ఈ యింటికి ఒకనాటి యజమాని.

రెండవ వ్యక్తి యాభయ్ సంవత్సరాల వితంతువు. ఆమె ఆ వృద్ధుడి కూతురు ఈనాటి ముద్దాయి తల్లి. మూడో వ్యక్తి ఇరవై ఐదు సంవత్సరాల నిండు చూలాలు.

ఆమె పేరు నాగమణి.

ఆమె ఆ ఇంటి రెండోతరం ఆడబడుచు. ఆమె ఆ వృద్ధుడి కొడుకు కుమార్తె.

అవిరామంగా సాగుతున్న ఆ కోర్టు విచారణలో ముద్దాయి ముప్పయి మూడు సంవత్సరాల విధవరాలు-వంటింటి తలుపునానుకుని అవమానంతో చితికిపోతూ, కళ్ళూ, తల కూడా వాల్చుకుని నిల్చొనుంది.

ఆ పిల్లకు నిల్చోడానిక్కూడా శక్తున్నట్టు లేదు అయినా ఎవ్వరూ ఆ పిల్లను కూర్చోమనలేదు.

ఆమె తల్లి మాత్రం ఆ పిల్లకు కాస్త దూరంలో ఆ పిల్లలాగే తల వంచుకుని వంటింటి వాకిట్లో తనకు తానై చతికిలబడి కూర్చుంది.

ఆర్థికంగా కుటుంబాల్ని మూడు తెగలుగా విభజిస్తే అందులో రెండో తెగకి, మూడో తెగకి మధ్య వచ్చి నిలుస్తుంది. ఆ కుటుంబం-కానీ సాంప్రదాయాలూ, ఆచారాలు, పూర్వీకుల ప్రాశస్త్యాలు లెక్కిస్తే మొదటి తరగతి కొస్తుంది.

అలాటి ఇంట్లో ఓ విధవరాలి కూతురు తప్పుచేసింది. భర్త చనిపోయిన ఐదు సంవత్సరాల తర్వాత ఇష్టపడో ఆకర్షణకు లొంగో, తన శరీరం ఎవరికో ఇచ్చింది-అదీ నేరం.

"ఇలాటి పాపిష్టి పని ఎలా చేసావే! పదో సారడిగింది ఆ ఇంట్లో మరో తల చెడిన వ్యక్తి....అరవై సంవత్సరాల లక్ష్మీదేవమ్మ-ఆమె బాల వితంతువు-ఆ వృద్ధ మాజీ యజమానికి స్వయానా చెల్లెలు.

ఆ ప్రశ్నకు జవాబు ఆ పాపిష్టి పనిచేసిన శ్యామల చెప్పలేదు.

"అసలెందుకు చేసావీ పని?" ప్రశ్నను యీ సారి మార్చింది లక్ష్మిదేవి.

ఒక్కసారి తలెత్తి చూసి తల దించుకుంది. శ్యామల తల్లి తులసి.

తులసి దగ్గర ఆ ప్రశ్నకు జవాబు సిద్ధంగా వుంది. కానీ ఆమె నోరు విప్పలేదు.

"అలా బెల్లం కొట్టిన రాయిలా కూర్చుంటావేం? కూతుర్ని మంద లించకుండా"

ఈసారి లక్ష్మి దేవమ్మ బాణం తులసి మీద కొచ్చింది.

తులసి తలెత్తింది.

ఆమె తలలో నెరసిపోయిన వెంట్రుకలు చిందర వందరగా వున్నాయి. ముప్పయి మూడేళ్ళగా ఎలాటి అనుభూతిని పారవశ్యాన్ని అనుభవించని ఆమె బుగ్గలు, పెదాలు కూడా ఎండిపోయున్నాయి.

తలెత్తిన తులసి పెదవి విప్పలేదు. పెదవి విప్పితే తనూ అదే ప్రశ్న అడగాలి.

"ఎందుకు చేసావీ పని?" అని ఆ ప్రశ్నకు జవాబు ఇక్కడున్న అందరికీ తెలుసు ముఖ్యంగా భర్తను పదిహేడు సంవత్సరాలకే పోగొట్టు కుని ఆ స్పర్శకు, ఆ లాలనకు దూరమైన తనకు తెలుసు. ఈ ముప్పై మూడేళ్ళగా తన శరీరానికీ, మనసుకు జరిగిన పోరాటంలో తన మనసు గెలిచింది. కానీ తన కూతురి మనస్సు ఓడిపోయింది. ఆమె శరీరం గెలి చింది.

ఇంతకంటే ఏముందా ప్రశ్నకు జవాబు? అలా తన కూతుర్ని

నిలదీస్తున్న చెల్లెలి వైపు, కూతురి వైపు–ఆ కూతురి బిడ్డ వైపు మార్చి మార్చి చూసాడా వృద్ధుడు.

ముగ్గురూ తల చెడిన వాళ్ళే.... ఈ ఇంటికిది ఆచారం భర్తలను పోగొట్టుకుని ఇలా మిగిలిపోయే దురదృష్టం. ఈ ఇంటి ఆడవాళ్ళది కానీ తన భార్య ఒక్కటే ఆ విచారణ నుండి తప్పించుకుంది తను రాయిలా వున్నాడు. అప్పుడే ఆమె దివంగతురాలై పదేళ్ళయి పోయింది.

నిట్టూర్చాడా వృద్ధుడు.

అతనికి రోజు తెల్సిన వార్త భరించరానిదిగా వుంది. ఈ ఇంటి చరిత్రలో జరిగిన మొట్టమొదటి తప్పు ఇది. ఆ తప్పు జరిగింది. ఆడ వాళ్ళ చరిత్రలో, మగవాళ్ళ చరిత్రలో కాదు.

ఎలాటి వంశం ఇది!

"అయినా పెద్దమ్మా! వదిన మెత్తతనమే ఇంతటి ఘోరానికి దారి తీసింది. పిల్లల్ని అదుపులో వుంచుకోకపోతే ఎలా?" అంది వనజాక్షి.

ఆ ఇంటి కోడలు ఆమెకా ఇద్దరు బిడ్డలు-పెద్దది నాగమణి-పెళ్ళయి లక్షణంగా సంసారం చేసుకుంటోంది.

రెండవ వాడు యీ మధ్యనే పెద్ద మొత్తం కట్నం తీసుకుని, గృహస్థుడయ్యాడు. ఆ కొత్త పిల్ల కూడా అప్పుడప్పుడు తనకు తోచిన మాటలు విసురుతూనే వుంది.

తులసి గుండెలు మండిపోతున్నాయి.

ఈ ఇంట్లో ఇంత మంది మధ్య పెరిగిన పిల్ల శ్యామల ఆ పిల్ల పదిరోజుల బిడ్డగా వున్నప్పుడు తను భర్త విహీన అయ్యింది. హిందూ

సాంప్రదాయ ప్రకారం పుట్టింటికి చేర్చబడింది. ఆర్థికంగా కూడా వాళ్ళ మీద ఆధారపడింది.

తమ్ముడి బిడ్డల్ని తనే చాకింది. శ్యామలనీ తనే చాకింది. తన తమ్ముడి బిడ్డలు లక్షణంగానే వున్నారు. కానీ శ్యామలే....శ్యామలే తప్పు చేసింది. దానికి కారణం తనా? ఆ పిల్లను తను అదుపులో పెట్టలేదా? ఆ పిల్ల, ఆ పిల్ల కోరికల్ని అదుపులో పెట్టుకోలేక పోయిందా? తను ఆ పిల్లకు ఆంక్షలు పెట్టి వుంటే ఆ పిల్ల కోరికలు అదుపులో వుండేవా?

ఆ కోరికల బలం తనకు తెలుసుకానీ తను దానికి లొంగలేదు. కొంతకాలం పాతివ్రత్యం మీద మమకారంలో వాటిని జయించింది. ఆ తర్వాత ఈ కుటుంబ సాంప్రదాయానికి భయపడి కొన్నాళ్ళు వాటిని లొంగతీసుకుంది - ఆ తర్వాత కొన్నాళ్ళకు పాతివ్రత్యమూ, సాంప్ర దాయమూ, శీలమూ అన్నీ అబద్ధపు విలువలని తెలుసుకున్నాక కూడా తన తప్పు చేయలేదు. కారణం శరీరాన్నిచ్చి మనస్సు పోగొట్టుకోలేదు తను-తనకూ ఆ స్పర్శకావాలి, ఆ లాలన కావాలి. ఆ ఆదరణ కావాలి. ఆ మనిషి తోడు కావాలి కానీ కేవలం శరీరాన్ని కోరే మగాడి దగ్గర నుండి తను పొందబోయే లాలన స్పర్శనందం తన మనస్సుకుఅంటవు ఆ సత్యాన్ని తెలుసుకున్న తను తప్పు చేయలేదు. అంతేకానీ తన శరీ రంలో కోరికలులేక కాదు కానీ తన కూతురు తప్పు చేసింది. కోరిక లకు లొంగిపోయింది.

ఎందువల్ల?

తరం మార్పులో ఆ సాహసం వచ్చిందా? బ్రతికున్న రోజుల్ని సుఖమయం చేసుకోవాలనే సత్యాన్ని ఆ పిల్ల జీర్ణించుకుందా? ఆ పిల్ల ఎన్నుకున్న మార్గం ఆ పిల్లకు సుఖాన్నిచ్చిందా ? భయాలను, అవ మానాలనూ అధిగమించిన ఆ పిల్లకు నిజంగా ఆనందం దొరికిందా ? ఇంకా శ్యామల ఆ మార్గంలోనే పోతుందా ? పోతే తను దాన్ని వారిం

టాలా ? తను కోరుకుని కారణాలు ఏదైతేనేం–పొందలేని ఆనందాన్ని నిజంగా ఆ పిల్ల పొందుతుంటే అంగీకరించాలా? అడ్డు పెట్టాలా?

తులసికి అయోమయంగా వుంది. కానీ ఆ ఇంటికోడలికి, ఆ కోడలి కోడలికి మాత్రం శ్యామల చేసిన తప్పు భూతద్దంలో కన్పిస్తోంది వాళ్ళకు -భర్త దూరం తాలూకు అసంతృప్తి తెలీదు–అందిన ఏ విలువకూ గుర్తింపుండదు.

వాళ్ళిద్దరి దృష్టిలో శ్యామల పతిత చాలా నీచురాలు. లక్ష్మీదేవమ్మ దృష్టిలో కూడా ఆమెకు సాంప్రదాయం మీద, బ్రతికున్న మనుష్యులమీద కంటే ఎక్కువ అభిమానం మనుషుల్ని నొప్పించగలరు, కానీ సాంప్రదాయాల్ని నొప్పించలేదామె.

ఆ వృద్ధుడికి శ్యామలని చూస్తే జాలేస్తోంది. కానీ శ్యామల తప్పు చేసింది. ఈ ఇంటి ఆడపిల్ల తప్పుచేసింది. అతని నరనరమూ బాధతో మెలికలు తిరిగిపోతోంది.

"అసలెలా జరిగింది?" మరలా అడిగింది వనజాక్షి. ఆ ఇంటి కోడలు.

"అతను బలవంతం చేశాడు" మరలా చెప్పింది శ్యామల.

అది అబద్ధమూ కావొచ్చు. నిజమూ కావచ్చు.

బలవంతం చేస్తే మాత్రం- లొంగిపోవడమేనా? అది తప్పుకదూ. అప్పుడప్పుడూ శ్యామలనిచూస్తే జాలేస్తోంది. ఈ ఇంటికి పదిరోజుల పసిగుడ్డుగా వచ్చినపిల్ల శ్యామల.

"అమ్మా" నోరు విప్పింది నాగమణి. నోరు విప్పి ఈ అవమాన భారాన్నుండి శ్యామలను తప్పించాలని ప్రొద్దుట నుండి అనుకుంటున్నా ఆ వృద్ధుడు నోరు విప్పి సంజాయిషీ చెప్పాలనుకుంటున్న తులసి ఇద్దరూ నోరు విప్పకముందే నాగమణి నోరు విప్పింది.

"ఆ లెక్కకోస్తే నేనూ వ్యభిచారం చేస్తున్నానమ్మా"

ఆ హాలులో వున్న వ్యక్తులంతా తుళ్ళిపడ్డారు.

ప్రొద్దుటనుండి తలవంచుకుని వున్న శ్యామల కూడా తలెత్తింది ఉలిక్కిపడి.

ప్రొద్దుటనుండి శ్యామల చేసిన తప్పుకు ఉగ్రుడై కేకలు వేసివేసి అలసిపోయున్న ఆ యింటి యజమాని వనజాక్షి తన భర్త కూడా ఉలిక్కిపడ్డట్లు తలెత్తాడు.

ఎవరినోట గుండా ఇంకా శబ్దం రాకముందే నాగమణి అంది.

"మీరు విచారణ ప్రారంభించనక్కరలేదు. నేను ముద్దాయిని.

నేనే లాయర్ని, నేను జడ్జిని అన్నీ నేనే చెప్తాను" అరిచింది వనజాక్షి.

అవునమ్మా నేను నా భర్తతో వ్యభిచారం చేస్తున్నాను. నాకిష్టం లేని మగాడితో. ఇదో మీరంతా కలిసి అక్షింతలు వేసి లైసెన్సు ఇచ్చినందుకుగాను వ్యభిచారం చేస్తున్నాను.

"మణి"

"నువ్వు శ్యామల వదినను ఓ ప్రశ్న వేశావు. అతను బలవంతం చేస్తేమాత్రం లొంగిపోవడం తప్పుకదూ, అని మనం కూడా ఎన్నో సార్లు అలా మనసుకు వ్యతిరేకంగా వాళ్ళ బలవంతానికి సాక్ష్యంగా లొంగిపోయుంటాం గుర్తు చేసుకో"

"నోరు మూసుకో–వాళ్ళు మన భర్తలు"

"కావొచ్చునుకానీ వాళ్ళు మన భర్తలని మనం లొంగిపోలేదు. దినమంతా అతన్ని ఏవగించుకునే నేను రాత్రిపూట కొన్ని సమయాల్లో కాకపోతే కొన్ని సమయాల్లో కాకపోతే కొన్ని సమయాల్లో అయినా నా కోరికలకు లొంగిపోయి ఆ తర్వాత అతనికి లొంగిపోతాను. చెప్పమ్మా? అది వ్యభిచారం కాదూ.

"నువ్వు నోరు మూసుకుని లోపలికి పో" అరిచిందామె.

"తప్పదు నేను నోరు మూసుకుని లోపలికి పోవాల్సిందే, జరిగే దదే– అంతకంటే నేను చేయగలిగేదేంలేదు కాకపోతే ఒక్కమాట"

అందరూ నిశ్శబ్దంగా కోపంగా అమెవేపు చూశారు. ఆ పిల్లకు పెళ్ళి ఎందుకు చేస్తారు."

ఎవరూ మాట్లాడలేదు.

"ప్రకృతి సిద్ధమయిన కోరికలు తీర్చుకోవడానికి అది సాంఘి కంగా మనం ఏర్పరచుకున్న నియమతం అవునా?"

"కోరికలు....కోరికలు....ఎంత సేపటికీ ఏమిటే, ఆ కోరికలు, వణికిపోతూ అరిచింది లక్ష్మిదేవమ్మ. ఆమెకు కోరికలు వయస్సు దాటి చాలా కాలమయింది.

"ఆడదానికి పెళ్ళి పిల్లల కొరకు" ఆయాసపడుతూ అంది లక్ష్మి దేవమ్మ మరలా.

బామ్మ! పెళ్ళి పిల్లలకోసం అయితే నేను కాస్త ఓపన్‌గా మాట లాడుతున్నాను. ఏమీ అనుకోవద్దు. మా అమ్మ ఇక నాన్నగారి బెడ్ రూమ్‌లో కెళ్ళాలిసిన అవసరంలేదు.

తల్లి ప్రేమ భర్త ప్రేమ కంటే గొప్పది. ప్రతి ఆడదీ భర్త నెందుకు ప్రేమిస్తోంది.

తల్లిని వదిలి ఆతన్నే ఎందుకు అంటి పెట్టుకోనుంటుంది? ఆర్థిక మైన స్వాతంత్ర్యం లేకో, సాంఘిక భద్రత లేకో అని మీరనవచ్చు, అది పూర్తిగా నిజంకాదు. అది నటనకానీ, నిజం కానీ ఆడ దానికి భర్త దగ్గర నుండి ఆ లాలన కావాలి ఆ స్పర్శ కావాలి, ఆ ఆదరణ కావాలి. అలాంటి ఆదరణను పోగొట్టుకున్న శ్యామల వదినకు ఇద్దరు బిడ్డలతల్లి అయిన మూడు పదులు దాటిన ఆమెకు మనం భర్తను వెతికి పెట్టలేం. ఆ ఆనందాన్ని ఆమె కొనుక్కుంటే ఎందుకలా గొంతు చించుకొని అరుస్తారు? ఎవరికి అన్యాయం జరిగిందని? అలా ఆమెని ఆడిపోసుకుంటారు? ఇప్పుడు సృష్టికి వ్యతిరేకంగా ఏమి జరిగిందని

గుండెలు బాదుకుంటున్నారు మీరు? ఆమె ఆనందంగా వుంటే ఎందుకు కుళ్ళి చస్తున్నారు మీరు.

"నీకు మతిపోయిందా ఏం ? ముందులోపలికి పో నువ్వు" ఇంచుమించూ కూతుర్ని బలవంతంగా లోపలికి నెట్టుకుపోయింది వనజాక్షి.

ఆ మూర్నాడు ఆ ఇంట్లో మరో సంఘటన జరిగింది. ప్రొద్దునే పేపర్‌లో తలదూర్చేసి అక్షరాలు కూడబలుక్కుంటున్నట్టుగా కాస్త పెద్దగా పైకే చదువుకుంటున్న పరంధామయ్య తన ముందు ఎవరిదో నీడపడడంతో పేపరులో నుండి తలపైకెత్తి చూశాడు.

పద్దెనిమిది, పంతొమ్మిదేళ్ళ అందమైన అమ్మాయి వాడిపోయిన ముఖంతో ఆదిరే పెదాలతో నిల్చుంది.

"ఎవరమ్మా నువ్వు?"

"నా పేరు శారద"

"ఏం కావాలి నీకు"

"న్యాయం"

విస్తుపోయినట్టు చూసాడాయన.

"ఏం న్యాయం కావాలి నీకు?" ఆశ్చర్యాన్నుండి తేరుకుంటూ చిరునవ్వుతో అడిగాడు.

"ఆ న్యాయం ఎలాగూ ఇకమీరు చేయలేరనుకుంటాను. కానీ జరిగిన అన్యాయం ఈ ఇంట్లో ఎవరివల్ల జరిగిందో తెలుసుకుందామని వచ్చాను."

ఈసారి తాతగారి ముఖంలో చిరునవ్వు మాయమయింది.

"కూర్చో....ఏం జరిగింది? నువ్వెవరివి?"

"నువ్వెవరివి అని అడిగారు కనుక జవాబు చెపుతున్నాను. మీరు అంగీకరించకపోయినా నేను ఈ ఇంట్లో వుండే మాధవరావు భార్యను."

తృళ్ళి పడ్డారాయన.

"మాధవరావు భార్యవా?"

"ఊఁ అంతేకాదు, మాధవరావు బిడ్డకు కాబోతున్న తల్లిని కూడాను"

ఈ జవాబు విని అతడు వణికిపోయాడు. నిన్న జరిగిన రభస తోనే అతని మానసిక ఆరోగ్యం సగం క్షీణించింది.

"మాధవ్ నిన్ను పెళ్ళి చేసుకున్నాడా?"

ఆమె పవిట అడుగున వున్న మంగళసూత్రాలు నిశ్శబ్దంగా పైకి తీసి చూపింది.

"కూర్చో....కూర్చోమ్మా" అతని కంఠం వణికింది.

ఎంతన్యాయం జరిగింది ఎంత దుర్మార్గుడు మాధవ్.

ఆమె నీరసంగా కూర్చుంది. కేవలం ఆమె ఆవేశం. ఆమెకు జరిగిన అన్యాయం ఆ పిల్లచేత ఇన్ని మాటలు మాట్లాడించింది. కానీ ఇంకా నిల్చునే శక్తి ఆ పిల్లకు వున్నట్లు లేదు.

"నేను ఒక్కసారి మాధవ్‌తో మాట్లాడొచ్చా తాతగారూ!" తనని తాను అదుపులో పెట్టుకుంటూ అంది శారద.

అతను తేరుకున్నాడు.

తప్పకుండా తల్లీ....తప్పకుండా మాట్లాడు.

"పిలుస్తారా? లోపలి కెళ్ళమంటారా?"

"తప్పు చేసినవాడు బయటకు రావడం న్యాయం. ఉండు పిలు స్తాను. తడబడే అడుగులతో లోపలికి నడిచిన అతనికి ఇంట్లో ఎవరూ కన్పించలేదు. దోషులుగా మిగిలిన తన కూతురు. ఆమె బిడ్డతప్పు"

కొడుకు కోడలు, వాళ్ళ కొడుకు మాధవ్, మాధవ్ భార్య గుడి కెళ్ళారు. పాప ప్రక్షాళనం చేసుకోను కాబోలు.

"ఇంట్లో ఎవరూ లేరమ్మా....నేను అబద్ధం చెప్పడంలేదు. కావా లంటే నువ్వెళ్ళి చూడు.

లేదు తాతా. మీరు అబద్ధం చెప్పలేరు. నాకర్థమయింది. వస్తాను. నాకు న్యాయం జరగాలంటే మరో ఆడపిల్లకు అన్యాయం జరగాలి. అందుకే ఈ ఇంట్లో స్థానం కొరకు నేను రాలేదు. కేవలం నన్ను అన్యా

యం చేసాడో, నన్ను కాదనుకున్నాడో అడిగి పోదామని మాత్రమే వచ్చాను. నా ఆవేశం చల్లారకపోతే మరలా సాయంత్రం వస్తాను. ఇది మీ మనుమడికి చెప్పండి. నమస్కారం. ఆ పిల్లలేచి విసురుగా వెళ్ళిపోయింది. వృద్ధుడిలో శక్తినంతా లాక్కుని వెళ్ళిపోయింది.

ఆ మధ్యాహ్నం కొడుకుని, కోడల్ని పిలిచి ఆ విషయం చెప్పినప్పుడు వాళ్ళ దగ్గరనుండి అందిన జవాబు ఆ వృద్ధుణ్ని విభ్రాంతిలోను, విపరీతమైన విచారంలోనూ ముంచింది.

"ఈ విషయం మాకు ముందే తెలుసు నాన్నా."

"ముందే తెలుసా? ముందే తెలిస్తే నాకెందుకు చెప్పలేదు?"

"మీరు బాధపడ్తారని, వాడిని కోప్పడతారని" కోడలు జవాబు చెప్పింది.

ఆ వృద్ధుడి మానసిక చలనం క్షణం ఆగిపోయింది.

"ఏదో పసితనంలో అలా చేసాడులే నాన్నా, మీరు బాధపడకండి" ఆ వృద్ధుడికంతా అయోమయంగా వుంది.

తను దేనికి బాధపడాలి? దేనికి బాధపడకూడదు? పసితనంలో ఎన్నో తప్పులు చేస్తుంటాం అని తన కొడుకుని సమర్థిస్తున్నాడు. తన కొడుకు ఇరవైనాలుగు గంటలక్రితం ఏ తప్పయితే ఓ ఆడపిల్లను బోనులో ఎక్కించి ముద్దాయిగా నిలబెట్టి సవాలక్ష ప్రశ్నలువేసి ఆఖరకు ఆ పిల్లను క్షమించకుండానే సమావేశాన్ని ముగించారో వాళ్ళే వాళ్ళ కొడుకుని అదే తప్పుకు వాడు క్షమాపణ అడక్కుండానే క్షమిస్తున్నారు.

తన కొడుకు-తనకు పుట్టిన కొడుకు- తను పెంచిన కొడుకు- తెలిసి ఒక ఆడపిల్లకు ఇంత అన్యాయంచేసి మరో పెళ్ళి చేసాడా తన కొడుక్కి! అతని మనసు యీ రోజు కూడా మండిపోతోంది.

'భవానీ' నోరు విప్పాడు వృద్ధుడు.

నిన్న శ్యామల చాలా పెద్ద తప్పుచేసిందనుకున్నానయ్యా, కానీ ఈ రోజు అంతకంటే పెద్ద తప్పు నాకొడుకు చేసాడని తెలిసి కృంగిపోతున్నానురా.

"నాన్నా!"

"భవానీ! నిన్ను నేను చాలా బాగా పెంచానని ఇన్నాళ్ళు గర్వపడ్డాను. కనీసం సిగరెట్లు కూడా తాగవని నా పెంపకం తాలూకు ప్రయోజకత్వానికి మురిసిపోయాను, కానీ నాయనా! ఈరోజు తెల్సుకున్నాను, నా కొడుకు ఇంత కిరాతకుడిని."

"నాన్నా!" కోపంగా చూశాడు భవానీ ప్రసాద్.

"కోప్పడకు భవానీ, నీ తప్పుని నువ్వు తెల్సుకో, అప్పుడు శ్యామలలాంటి వాళ్ళ తప్పుల్ని ఎత్తి చూపించు. శ్యామల చేసిందీ తప్పేకానీ దానివల్ల ఎవరికీ అన్యాయం జరగలేదు. భార్యలేని ఒకతని కేవలపు కోరిక తీర్చను తన శరీరాన్నిచ్చి తన శరీరాన్నే మలిన పర్చుకుంది. కానీ, భవానీ నువ్వు చేసిన పని అన్యాయం, నీవల్ల జరిగిన నష్టం, నీ కర్థంకాలేదు. అది....అది. ఓ నిండు జీవితం."

"నాన్నా! మీరు.........—మీరు నన్ను........"

"భవానీ! నిన్నిలా తప్పుపట్టే రోజు రాకూడదనే అనుకున్నానయ్యా. ఈ రోజు రాకముందే నేను మీ అమ్మను చేరుకోనుంటే ఎంత బాగుండేది" నిట్టూర్చాడతను.

భవానీప్రసాద్ మనసు కిది పెద్ద దెబ్బే. ఆ తప్పుని సరిదిద్ది మన కుటుంబ సాంప్రదాయానికి దెబ్బ తగలకుండా నేను మరలా పెళ్ళి చేస్తే....మీరు నాది తప్పంటున్నారా?........"

"నాయనా భవానీ నిన్ను శ్యామల చేసిన పనికి మన ఇంటి పరువు ప్రతిష్టలకు చిల్లి పడిందనే అనుకున్నాను. కానీ ఈరోజనుకుంటున్నాను· నా మనుమడి చేత నువ్వు చేయించిన ద్రోహం ముందు నా మనువరాలు చేసింది. తప్పుకాదు. అలా అని నా అంతరాత్మ తీర్పు ఇచ్చిందీ రోజు. నా ఈ తీర్పు న్యాయసమ్మతమో కాదో నాకు తెలియదు" ఆ వృద్ధుడు లేచాడు, భవానీప్రసాద్ ఆత్మ పరిశీలనలో పడ్డాడు.

*